## క్లుప్తంగా

### డిజిటల్ టీవీలను వినియోగించండి: డీఈఓ



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఈఓ

చేర్యాల(సిద్దిపేట): జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా వేచరేణి ఉన్నత, ప్రాథమిక పాఠశాలకు వెళ్లి అక్కడ విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. అనంతరం పట్టణ కేంద్రంలోని బీడీ కాలనీ స్కూల్, ఉర్దూ, బండపల్లి పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ టీవీలను ఉపయోగించి బోధించాలని సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యంపై తగు సూచనలు ఇచ్చారు. అలాగే విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్, గణితం చదవడం రాయడాన్ని పరిశీలించారు.

### శ్రీవాణి పాఠశాలకు షోకాజ్ నోటీస్



షోకాజ్ నోటీస్ అందజేస్తున్న ఎంఈఓ

దుబ్బాక: పట్టణంలోని శ్రీవాణి పాఠశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీస్‌లు జారీచేసినట్లు మండల విద్యాధికారి ప్రభుదాస్ తెలిపారు. బుధవారం ఆ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో క్రీడా స్థలం, ఫైర్ సేఫ్టీ లేదని, అలాగే మెయిన్ రోడ్డుపై ఉండడంతోపాటు చాలా లోపాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. పాఠశాలలో ఏడు రోజుల్లోగా అన్ని సౌకర్యాలు కల్పించాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### గడువు తర్వాతనే నిర్వహించాలి



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్: నిరుద్యోగులు ఇచ్చిన 90 రోజుల గడువు తర్వాతనే డీఎస్సీ పరీక్షలు నిర్వహించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు పది రోజులుగా ఉస్మానియా యూనివర్సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో డీఎస్సీ వాయిదా వేయాలని, 25వేల టీచర్‌ల ఉద్యోగాలను భర్తీ చేయాలని దీక్షలు చేస్తున్నారన్నారు. ఇటీవలనే చాలామంది టెట్, వివిధ పోటీ పరీక్షలు రాశారని, ఇప్పుడే డీఎస్సీ నిర్వహిస్తే నిరుద్యోగులపై ఒత్తిడి పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులు ఇచ్చిన సమయం ప్రకారం పోటీ పరీక్షలు నిర్వహించాని కోరారు. సమావేశంలో శంకర్, సుధాకర్, రాజు, శరత్ తదితరులు ఉన్నారు.

### విద్యతోనే ఉన్నత స్థాయికి..



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మహేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): విద్య వినయానికి, సౌశీల్యానికి మారుపేరని వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సిర్సనగండ్ల ఉన్నత పాఠశాలలో బుధవారం రంగనాయక రచయితల సంఘం ఆధ్వర్యంలో జెరైతే, అర్ధాంగి పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేది ఉపాధ్యాయులేనన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విఠల్, రచయితల సంఘం అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### క్రీడాభిమానుల సన్మానం



గణేశ్‌ను సన్మానిస్తున్న అభిమానులు

గజ్వేల్‌రూరల్: ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాభిమానులు కోరారు. ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు మొట్టమొదటి సారిగా జిల్లా నుంచి ప్రధాన కార్యదర్శిగా నియామకమైన గజ్వేల్‌కు చెందిన రాంగారి గణేశ్‌ను ఫుట్‌బాల్ క్లబ్ తరపున బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీస్తూ వారికి మెరుగైన శిక్షణను అందించాలని కోరారు. క్లబ్ ప్రతినిధులు రమేశ్‌గౌడ్, నర్సింహులు, శ్రీధర్, చక్రపాణి, ఎల్లయ్య, విఠల్, రాజ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి

**నిరుపయోగంగా మండల వనరుల కేంద్రం**

- రెండేళ్లు కావస్తున్నా అధికారుల నిర్లక్ష్యం
- వినియోగంలోకి తేవాలంటున్న విద్యార్థులు

విద్యావ్యవస్థను గాడిన పెట్టేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మండల వనరుల కేంద్రాన్ని ప్రారంభించింది. కాని ఇప్పటి వరకు అది వినియోగంలోకి రాలేదు. లక్షలు వెచ్చించి నిర్మించిన ఆ కేంద్రం నిరుపయోగంగా మారింది. విద్యుత్ సదుపాయం, అవసరమైన సామగ్రి లేదని విమర్శలున్నాయి. అలాగే స్వీపర్, కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించలేదు. దీంతో రెండు సంవత్సరాలుగా అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది.

– మర్కూక్(గజ్వేల్)




నిరుపయోగంగా ఉన్న మండల వనరుల కేంద్రం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతనంగా మర్కూక్ మండలం ఏర్పడింది. మండలంలో అధునాతన రీతిలో పోలీస్‌స్టేషన్, వైద్య ఆరోగ్యకేంద్రం, కస్తూర్బా గురుకుల పాఠశాల, పంచాయతీ భవనం, పోలీస్ క్వార్టర్స్ నిర్మించారు. వాటితో పాటు రూ.31 లక్షల ఎస్ఎస్ఏ నిధులతో నిర్మించిన వనరుల కేంద్రాన్ని 2022లో ఎమ్మెల్సీలు వంటేరు యాదవరెడ్డి, కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చేర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి అప్పటి మంత్రి హరీశ్‌రావు లాంచనగా ప్రారంభించారు.

**వినియోగంలోకి తేవాలి**

రెండేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు మండల వనరుల కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావడం లేదని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వాపోతున్నారు. ములుగు, మర్కూక్, జగదేవ్‌పూర్ మండలాలకు ఒకే మండల విద్యాధికారి ఉండడంతో ఇటు ఉపాధ్యాయుల సమస్యలు, అటు పాఠశాలల పర్యవేక్షణ ఇబ్బందిగా మారిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. మండలంలో ఆరు ప్రాథమికోన్నత పాఠశాలలు, నాలుగు ఉన్నత పాఠశాలలు, 16 ప్రైమరీ పాఠశాలలు, ఒక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఉన్నాయి. ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో సమావేశాలు మండల కేంద్రమైన మర్కూక్ పాఠశాలలో నిర్వహించడంతో విద్యా బోధనకు అంతరాయం ఏర్పడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**ప్రభుత్వం స్పందించాలి**

లక్షల రూపాయలు వెచ్చించి మండల వనరుల కేంద్రాన్ని నిర్మించి నిర్లక్ష్యంగా వదిలేయడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం కూడా ప్రారంభమైనా వినియోగంలోకి తీసుకురాలేదని వాపోతున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఈ నూతన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

**అధికారులకు తెలియజేశాం..**



మండల వనరుల కేంద్రంలో విద్యుత్ సదుపాయం, అవసరమైన సామగ్రి లేదు. అలాగే కంప్యూటర్ ఆపరేటర్, స్వీపర్‌ను నియమించలేదు. అందుకే వినియోగంలోకి తీసుకురాలేదు. ఈ విషయం పై అధికారులకు సమాచారం అందించాం. మరోసారి పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు కృషిచేస్తా.

– ఉదయ్ భాస్కర్‌రెడ్డి, మండల విద్యాధికారి



మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రజిత

# భవిష్యత్ తరాల కోసమే మొక్కలు

**మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత**

హుస్నాబాద్: నాటిన ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందని, మొక్కలను సంరక్షించుకునే బాధ్యతను అందరూ తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పిలుపునిచ్చారు. బుధవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటికి ఇచ్చిన మొక్కలను కాపాడుకోవాలన్నారు. తడి చెత్తతో తయారు చేసిన ఎరువును మొక్కలకు వాడుకోవాలని సూచించారు. మొక్కలు నాటడంవల్ల వాతావరణ కాలుష్యం తగ్గడం, వర్షాలు కురువడం, ఆక్సిజన్ శాతం పెరగడం లాంటి ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ వల్లపు రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, వన మహోత్సవ సూపర్‌వైజర్ శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు పద్మయ్య అన్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో స్కిల్ ఇన్ విలేజ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ఆంగ్ల విద్య, ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ్‌పాండే సంస్థ నుంచి గ్రామానికి చెందిన శ్వేత ఆంగ్ల బోధనలో 25 రోజులు కర్ణాటకలో శిక్షణ తీసుకుని పాఠశాలలో తరగతులు నిర్వహించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ తరగతులను పాఠశాల సమయంలో కాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తారని చెప్పారు.



విద్యార్థులతో మాట్లడుతున్న హెచ్‌ఎం పద్మయ్య

ఇంగ్లిష్‌లో మాట్లడటం, చదవటంతో పాటు పలు అంశాలను నేర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రైమరీ ప్రధానోపాధ్యాయలు శంకరయ్య, భాస్కర్, సంతోష్, నాగలక్ష్మి, అనిత, శ్రావణి, సందీప పాల్గొన్నారు.

# హాస్టళ్లలో పరిస్థితులు అధ్వానం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి స్వామి

గజ్వేల్‌రూరల్: బడుగు, బలహీన వర్గాల పిల్లలే హాస్టళ్లలో ఉంటారని, హాస్టళ్లలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం విద్యాహక్కుల పరిరక్షణ ఉద్యమంలో భాగంగా ఆయన వివిధ హాస్టళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా చౌట్కూర్ మండలం సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ హాస్టల్ మెస్‌లో చట్నీ పాత్రలో చిట్టెలుక పడిందని, అలాగే రామయంపేట మండల పరిధిలోని మోడల్‌స్కూల్‌లో అల్పాహారం తిని 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని మండిపడ్డారు. ఈ రెండు ఘటనలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టళ్ల చుట్టూ ప్రహరీలు లేక రక్షణ కరువైందని చెప్పారు. బాత్‌రూమ్‌లకు తలుపులు లేకపోవడం, పరిసరాల అపరిశుభ్రతతోను విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్యంవల్లే ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని మండిపడ్డారు. మరోసారి పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న స్వామి

# సుహాసీరావుకు సత్కారం

బెజ్జంకి(సిద్దిపేట): లండన్‌లో మిస్‌టీన్‌గా నిలిచిన మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన బోయినిపల్లి సుహాసీరావును బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. బోయినిపల్లి ప్రమద్‌రావు లండన్‌లో వ్యాపారిగా స్థిరపడ్డారు. అతని కుమార్తె సుహాసీరావు కొన్ని నెలల క్రితం లండన్‌లో జరిగిన మిస్‌టీన్ పోటీలలో విజేతగా నిలిచారు. ఆమె బుధవారం స్వగ్రామానికి రావడంతో మాజీ సర్పంచ్ బోయినిపల్లి నర్సింగరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం రఘు తదితరులు ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్కులు, చాక్లెట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక గ్రంథాలయాలనికి పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నాగరాజు, శ్రావణ్, సురేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



సుహాసీరావును సత్కరిస్తున్న హెచ్‌ఎం రఘు

# హామీల అమలులో కాలయాపన

ములుగు(గజ్వేల్): హామీల అమలులో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషాన్ మోర్చ మండల అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం రైతు భరోసా హామీని నెరవేర్చడం లేదని వాపోయారు. రూ.2లక్షల రుణమాఫీ విషయంలో కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌రెడ్డి, మధు, వీరేష్, నర్సింహులు, మల్లేశ్, సత్యనారాయణ, భాస్కర్‌గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

### డ్రైనేజీని శుభ్రపరచండి..

దుబ్బాక: పట్టణంలోని 12వ వార్డులో చెట్టును కొట్టడంతో ఆ చెత్తంతా పడి డ్రైనేజీ నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోందని ఆ కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువలో చెత్త నిండి దోమలు, ఈగలు విజృంభించడంతో ఇండ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీ

# ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను ఆపండి

- కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి
- కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కితీసుకోవాలి
- సీఐటీయూ నేతల డిమాండ్

కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సీఐటీయూ నేతలు వివిధ సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలు డిమాండ్‌లపై సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కార్మిక వ్యతిరేక చట్టాలను రూపొందించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆశా వర్కర్‌లు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన, ఐకేఉపీ, వీఓఏ, ఆర్పీ, వైద్యారోగ్యరంగంతో పాటు వివిధ స్కీమ్‌లలో పనిచేస్తున్న వర్కర్లను కార్మికులుగా గుర్తించి చట్టాలను అమలు చేయాలని కోరారు. వివిధ సమస్యలపై తహసీల్దార్లు, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



గజ్వేల్‌లో ఆర్డీఓ బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్వామి తదితరులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ఐవోసీలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి, వేణుగోపాల్, వెంకటచారి, మల్లయ్య, రాజు, రమేశ్, రామారావు, మహేందర్‌రెడ్డి, మనోజ్‌కుమార్, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**కనీస వేతనం చెల్లించాలి**

చేర్యాల(సిద్దిపేట): తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాళ్లబండి భాస్కర్ పాల్గొన్నారు. తహసీల్దార్ మహమ్మద్ సమీర్ అహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు కుమార్, నాగరాజు, సంతోష్, మల్లేశం, చందు, రామచంద్రం, ప్రశాంత్, రాజు, శేఖర్, యాదగిరి, పద్మ, మంజుల, కనకవ్వ, అంజమ్మ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేటజోన్‌లో..**

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ ఆధ్వర్యంలో స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వం వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కనకయ్య, నర్సింహులు, రాజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

**నంగునూరు(సిద్దిపేట)లో..**

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని యూనియన్ జిల్లా నాయకుడు దేవులపల్లి రాజమౌళి ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించి తహసీల్దార్ సరితకు వినతి పత్రం అందజేశారు. ఎల్లయ్య, బాలరాజు, రవీందర్, కనకయ్య, బాలయ్య, నర్సవ్వ, కనకవ్వ, యాదవ్వ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

**దుబ్బాకలో..**

పట్టణ కన్వీనర్ భాస్కర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాను చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. రాజు, మంజుల, శ్యామల, భారతి, అనిత, లత, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

**మిరుదొడ్డి(దుబ్బాక)లో..**

సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి మద్దెల అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పరశురాములు, శ్రీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల(సిద్దిపేట): తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

**వర్గల్(గజ్వేల్)లో..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని జిల్లా నాయకుడు వెంకటచారి డిమాండ్ చేశారు. నాయకులు బాబురావు, కనకయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

**తొగుట(దుబ్బాక)లో..**

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దార్ శ్రీధర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. మండల కన్వీనర్ వసంత నేతృత్వంలో జరిగిన నిరసన కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**కొండపాక(గజ్వేల్)లో..**

కొండపాక, కుకునూరుపల్లి మండల తహసీల్దార్ల కార్యాలయాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, కొమురయ్య, రవీంద్రచారి, శ్రీనివాస్, కనకాచారి, జగపతి, నాగరాజు, నర్సింహులు పాల్గొన్నారు.

### పాదరక్షల టెండర్‌దారుడి అధిక వసూళ్లు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో పాదరక్షలు భద్రపరిచే టెండర్‌దారుడు అధికంగా డబ్బులు వసూలు చేయడమే కాకుండా దురుసుగా ప్రవర్తించడంతో కరీంనగర్‌కు చెందిన సుధీర్ కుమార్, సురేశ్‌పై భక్తులు ఆలయ ఈఓకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులను పాదరక్షల టెండర్ దారుడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. రూ.5ల బిల్లును రూ.10లుగా రాసి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆలయ అధికారులు టెండర్‌దారుడిని పిలిచి అధిక వసూళ్లు నిలిపివేయాలని ఆదేశించారు.

# పాలనను గాలికి వదిలేసిన ప్రభుత్వం

మిరుదొడ్డి(దుబ్బాక): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను పూర్తిగా గాలికి వదిలేసిందని మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు విమర్శించారు. బుధవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సింది పోయి ప్రత్యేక అధికారులను నియమించి పాలన సాగిస్తుందని మండిపడ్డారు. ప్రస్తుతం అధికారుల పాలనలో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు సతమతం అవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీ స్కీములతో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు బాల్‌రాజు, మాజీ ఎంపీటీసీ భైరయ్య, జ్యోతి బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు

## సంక్షిప్త వార్తలు

**◆ ఉపాధ్యాయులకు వీడ్కోలు**



చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ మదిర హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయుల బదిలీ సందర్భంగా బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు కె.స్వామి, జయశ్రీ, సుజాత బదిలీపై వెళ్లారు. వారిని హెచ్‌ఎం వాణిశ్రీ తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

**◆ భూములను కాపాడాలని వినతి**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి శివారులోని నల్లపోచమ్మ ఆలయ భూములను కాపాడాలని ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆయనను కలిసి కబ్జా విషయాన్ని వివరించారు. దీనిపై స్పందించిన ఆయన దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి భూముల రక్షణతోపాటు ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని చెప్పినట్లు తెలిపారు.

**◆ విద్యుత్ షాక్‌తో పాడిఆవు మృతి**

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుత్ షాక్‌కు గురై పాడి ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ధర్మారంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన గూళ్ల లింగం తన వ్యవసాయ బావి వద్దకు ఆవును మేతకు తీసుకెళ్లాడు. అక్కడ కుక్కలు ఆవును వెంబడించాయి. దీంతో ఆవు పరుగులు పెట్టి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో షాక్‌కు గురైంది. దీంతో అక్కడిక్కడే మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని, తనకు నష్ట పరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

**◆ బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం**

దుబ్బాకటౌన్: దౌల్తాబాద్ మండలం శేరిపల్లి బందారం గ్రామానికి చెందిన నాగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు బుధవారం పరామర్శించారు. తమ వంతు సహాయంగా రూ.20వేల సహాయం, నిత్యావసర సరకులు అందజేసి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మిత్రులు నాగరాజ్, శ్రావణ్, స్వామి, యాదగిరి, పెంటయ్య, గణేశ్, యాదిరెడ్డి, రాజలింగం తదితరులున్నారు.

**◆ గ్రామానికి రుణపడి ఉంటా..**

మద్దూరు(హుస్నాబాద్): జిల్లాల్లో ఏకైక కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీగా గెలిపించిన ఉమ్మడి మద్దూరు మండలానికి, జాలపల్లి గ్రామానికి రుణపడి ఉంటానని గిరి కొండల్ రెడ్డి అన్నారు. జెడ్పీటీసీ పదవీ కాలం పూర్తి కావడంతో ఆయనను ఎంపీటీసీ చెట్కూరి కల్యాణి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవి ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామానికి సేవా చేస్తాన్నారు.

**◆ ఘనంగా మత్స్యరైతుల దినోత్సవం**

కోహెడ(హుస్నాబాద్): మత్స్యరైతుల దినోత్సవాన్ని ప్రకృతి పర్యావరణ సంస్థ, మత్స్యరైతు సంఘాల ఆధర్వ్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రకృతి పర్యావరణ సంస్థ, మత్స్యరైతు సంఘాల ప్రతినిధి మొహమ్మద్ షాకిర్ మాట్లాడుతూ మత్స్య మంత్రిత్వశాఖ ప్రతియేటా జూలై10న మత్స్యరైతుల దినోత్సవం జరుపుతోందన్నారు. ఈ సందర్భంగా పెద్దమ్మ ఆలయం వద్ద బెజ్జంకి ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, ప్రకృతి పర్యావరణ సంస్థ నేతృత్వంలో పలువురి మత్స్య రైతులను సన్మానించారు.